క్లుప్తంగా

సర్పంచ్ ఎన్నికలకు దూరం

కడియం: మండలంలోని కడియపులంక సర్పంచ్ ఉప ఎన్నికలకు వైఎస్సార్ సీపీ దూరంగా ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ తెలిపారు. సర్పంచ్ మార్గాని అమ్మాణీ హఠాన్మరణంతో ఎన్నిక అనివార్యమైందన్నారు. ఆమె కుమార్తె మారిశెట్టి పద్మావతి సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ వేశారన్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ కడియపులంక నాయకులతో చర్చించి, సానుభూతి దృష్ట్యా పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు స్టాలిన్ తెలిపారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. గతంలో పోటీ చేసిన ఊటుకూరి శైలజ, పార్టీ నాయకులు తాడాల విష్ణుచక్రవర్తి, కొత్తపల్లి శివాజీ, తిరుమలశెట్టి శ్రీను, బోడపాటి సత్యనారాయణ తదితరులు చర్చల్లో పాల్గొన్నారన్నారు. ఇలాఉండగా మార్గాని ఏడుకొండలు, పుల్లా రామారావు తదితరులు చెల్లుబోయిన వేణును కలిసి కృతజ్ఞతలు చెప్పినట్లు స్టాలిన్ తెలిపారు.

బ్యాంకులను సందర్శించిన ఆర్డీవో



బ్యాంకర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణనాయక్

కడియం: అన్నదాత సుఖీభవ పథకం ప్రతి రైతుకు అందేందుకు బ్యాంకర్లు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది కృషి చేయాలని ఆర్డీవో కృష్ణనాయక్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని పలు బ్యాంకులను సందర్శించారు. ఎన్‌పీసీఐ, ఈ-కేవైసీ తదితర కారణాలతో రైతులకు సంబంధించిన ఖాతాల స్టేటస్ నిలిచిపోతే, తక్షణం వాటిని సరిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి రైతు ఖాతాకు సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట వ్యవసాయాధికారి పద్మలత, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆహార నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్



క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: అన్న క్యాంటీన్‌లో ఆహార నాణ్యతలో లోటుపాట్లు లేకుండా, రుచిగా, శుచిగా చేయాలని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. గురువారం స్థానిక జీఎస్టీ రోడ్డులోని అన్నా క్యాంటీన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియా, టాయిలెట్లను పరిశీలించారు. భోజనం నాణ్యత ఎలా ఉందో కస్టమర్లను అడిగి తెలుసుకున్నారు. తమ అభిప్రాయాలను క్యాంటీన్‌లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తెలియజేయవచ్చన్నారు. అనంతరం దానవాయిపేటలో పర్యటించారు. కొందరు చెత్తను ప్లాస్టిక్ కవర్లలో మూటగట్టి, రోడ్ల పక్కన పడవేస్తున్నట్లు గుర్తించారు. స్వచ్ఛ రాజమహేంద్రవరం నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విశాఖపట్నంలోని పిన్నింటికి వెళతానని చెప్పి బయలుదేరిన తన భర్త ఇప్పటివరకు తిరిగిరాలేదని ఇన్నీసుపేట పాత రామాలయం వీధికి చెందిన భవానీ శాంతికుమారి గురువారం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు, 37 ఏళ్ల కొండాబత్తుల విజయకుమార్ మంగళవారం సాయంత్రం విశాఖపట్నంలోని పిన్నింటికి వెళుతున్నానని చెప్పి ఇంటి వద్ద నుంచివె బయలుదేరాడు. ఇంటికి తిరిగిరాలేదని శాంతికుమారి ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు



శ్యామల	: సార్ మేడమ్
సూర్య మినీ	: మహావతార్ నరసింహ
సూర్య ప్యాలెస్	: కింగ్‌డమ్
స్వామి	: హరిహర వీరమల్లు
అనుశ్రీ	: హరిహర వీరమల్లు
శివజ్యోతి	: సార్ మేడమ్
రాజా	: కింగ్‌డమ్
ఊర్వశి	: మహావతార్ నరసింహ
మేనక	: సన్ ఆఫ్ సర్దార్-2
రంభ	: ది ఫెంటాస్టిక్ ఫోర్
అప్సర	: కింగ్‌డమ్
అశోక	: కింగ్‌డమ్
నామవరం	
వీఎస్ మహల్	: కింగ్‌డమ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: కింగ్‌డమ్
కడియం	
వెంకట సూర్య	: కింగ్‌డమ్



బాలాజీపేట నుంచి బొమ్మూరు రోడ్డులో గొయ్యి



బొమ్మూరు 220 కేవీ సబ్‌స్టేషన్ వద్ద..



మహిళా ప్రాంగణం వద్ద..

అంతా గోతులమయం

- ఐఎల్‌టీడీ–రాజవోలు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 'గుంతల రహిత రోడ్లు' కార్యక్రమాన్ని గతేడాది నవంబర్‌లో ప్రారంభించారు. రోడ్లపై గోతులను పూడ్చి.. సంక్రాంతికి పండగను తీసుకువస్తామని కూటమి నేతలు ప్రగల్భాలు పలికారు. ఆచరణలో మాత్రం ఇదేమీ కార్యరూపం దాల్చిన దాఖలాలు కానరావడం లేదు. ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి రాజవోలు రోడ్డును చూస్తే ఇదంతా నిజమేననిపిస్తోంది. ఈ రోడ్డులో అడుగడుగునా గోతులే దర్శనమిస్తున్నాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి రాజవోలు గ్రామం మీదుగా రాజమండ్రి నగరంలోకి, పరిసర గ్రామాల నుంచి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డులో అడుగడుగునా గోతులు వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఐల్‌టీడీ జంక్షన్, బాలాజీపేట బ్రిడ్జి వద్ద తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు అవి యథాస్థితికి చేరుతున్నాయి. అలాగే బాలాజీపేట నుంచి బొమ్మూరు వైపు వెళ్లే రోడ్డు ఏ-1 రెస్టారెంట్ సమీపంలో భారీ గోతులు దర్శనమిస్తున్నాయి. రాత్రి సమయాల్లో ఇక్కడ చాలా మంది కిందపడి గాయాల పాలైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. బొమ్మూరు జాతీయ రహదారి నుంచి మహిళా ప్రాంగణం వరకు అడుగడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. యూనియన్ బ్యాంకు వద్ద, అపార్ట్‌మెంట్ ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. బొమ్మూరు 220 కేవీ సబ్‌స్టేషన్ వద్ద గోతులు వల్ల వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో పడి అనేక మంది గాయాల పాలవుతున్నారని, దీంతో స్థానికులు సున్నం బస్తా వేసి గుంతను తాత్కాలికంగా పూడ్చారు. మహిళా ప్రాంగణం ఎదురుగా రోడ్డుపై గోతులను ఇటీవలే పూడ్చినప్పటికీ, వర్షాలకు మరలా ఈ రోడ్డు గోతులమయంగా మారింది. ఈ గోతుల వల్ల వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆయా రోడ్లలో గోతులను పూడ్చడంతో పాటు, పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.



బొమ్మూరు సబ్‌స్టేషన్ వద్ద సున్నంతో పూడ్చిన గొయ్యి



మురళీకొండ వద్ద..

అడుగడుగునా గోతులే..



ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి రాజవోలు రోడ్డులో అడుగడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. రాత్రి సమయాల్లో వాహనచోదకులు గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. కూటమి ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నాయి మినహా, ఆచరణలో మాత్రం ఉండడం లేదు. ఇప్పటికైనా అధికారులు రోడ్లపై గోతులను పూడ్చించాలి.

– పెయ్యల రాజేష్, రాజవోలు

ఘనంగా ప్రేమ్‌చంద్ జయంతి

ప్రకాశం నగర్: ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో గురువారం మున్షి ప్రేమ్‌చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్కే రామచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రేమ్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ్‌చంద్ గద్యంలో కథలు, నవలలు రచించి, మానవాళి మనుగడకు కావాల్సిన ఉత్తేజాన్ని నింపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హిందీ విభాగాధిపతి ఉషారాణి, పలువురు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీ సాయికి ప్రత్యేక పూజలు



పెద రాయవరంలో షిర్డీ సాయిబాబా

రంగంపేట: పెద రాయవరం గ్రామంలో కొలువైన షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, బాబాను దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మాజీ ఎంపీ భరత్‌ను కలిసిన ద్వారకనాథ్ రెడ్డి



భరత్‌రామ్‌తో ద్వారకనాథ్ రెడ్డి, జగ్గిరెడ్డి తదితరులు



నూతన కమిటీ నేతలతో మాట్లాడుతున్న భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోదరుడు, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి గురువారం కలుసుకున్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న నేపథ్యంలో ద్వారకనాథ్ రెడ్డి రాజమహేంద్రవరంలో మకాం వేశారు. గురువారం వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం సిటీ కార్యాలయానికి పార్టీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ భరత్‌రామ్ వారికి స్వాగతం పలికారు.

నగర, జిల్లా కమిటీ నేతల కృతజ్ఞతలు

వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నగరానికి చెందిన 38 మంది పార్టీ నాయకులకు జిల్లా, నగర కమిటీల్లో ప్రాధాన్యం కల్పించారు. ఈ నేపథ్యంలో గురువారం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను నూతన కమిటీ సభ్యులు సిటీ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నగరానికి చెందిన ఏడుగురికి జిల్లా కమిటీలో స్థానం కల్పించగా, మిగిలిన వారిని సిటీ కమిటీలో నియమించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ, అధిష్ఠానం ఎంతో నమ్మకంతో సిటీ, జిల్లా కమిటీల్లో చోటు కల్పించినందున వారంతా పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సంపూర్ణంగా అమలు చేయకుండా అనుసరిస్తున్న విధానాన్ని ఎండగట్టాలని నిర్దేశించారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులపై, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని, ప్రశ్నిస్తున్న గొంతును నొక్కాలని చూస్తోందని, వీటిని సమర్థంగా ఎదుర్కొంటూ ప్రజల్లోకి వాస్తవాలను తీసుకెళ్లాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో నవరత్నాలు ఎలా అమలయ్యాయో, ప్రజలకు నగదు ఎలా ఖాతాల్లో చేరాయో గుర్తుచేయాలని సూచించారు. ఉభయ రాష్ట్రాల బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, ఇతర నాయకులు కూడా ఉన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి వెండి శఠగోపం సమర్పణ



శఠగోపాన్ని అందుకుంటున్న పీఠాధిపతి వెంకన్నబాబు తదితరులు

సీటీఆర్ఐ: గాడాలలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారికి ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త కొండమీద దుర్గారావు, రత్నం దంపతులు, వారి కుమారుడు శ్రీను 206 గ్రాముల వెండి శఠగోపాన్ని సమర్పించారు. గురువారం స్థానిక దేవీ చౌక్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో శ్రీమహాలక్ష్మి సమేత వేంకటేశ్వర స్వామి పీఠాధిపతి చిన్నవెంకన్నబాబుకు దీనిని అందజేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి చిన్నవెంకన్నబాబు మాట్లాడుతూ, శఠగోపం సాధారణంగా రాగి, కంచు, వెండితో తయారు చేయబడుతుందని, పైభాగంలో విష్ణు పాదాలు ఉంటాయన్నారు. దేవాలయంలో దర్శనం అనంతరం తీర్థం, శఠగోపం తీసుకోవడం ఆనవాయితీ అన్నారు. ఈ కార్యక్రమంలో మాతాజీ దుర్గా వెంకట హేమావతి,, ద్వారక తిరుమల మాజీ బోర్డ్ మెంబర్ కొత్త విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి హోమియో వైద్య శిక్షణ ప్రారంభం

ప్రకాశం నగర్: జగద్గురు పీఠం ఆధ్వర్యంలో స్థానిక గౌతమ ఘాట్‌లో ఈ నెల నాలుగో తేదీన హోమియో ప్రాథమిక వైద్య శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని పీఠం నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ శిక్షణ తరగతులు 40 సెలవు దినాలతో వచ్చే ఏడాది జూన్ వరకు కొనసాగుతాయని చెప్పారు. స్మార్ట్ ఫోన్ కలిగిన 25 నుంచి 40 ఏళ్ల లోపు, డిగ్రీ, తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. శిక్షణ ఉచితంగా ఇస్తారని, హోమియో పుస్తకాల కోసం రూ.1,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ చివర్లో 75 శాతం హాజరు ఉన్నవారికి పరీక్ష ఉంటుందని, ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 94406 87509 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పెన్షన్ మంజూరు పత్రాల అందజేత

కడియం: కొత్తగా పెన్షన్లకు ఎంపికైన లబ్ధిదారులకు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం మంజూరు పత్రాలు అందజేశారు. గురువారం మండల కేంద్రమైన కడియంలో పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మార్ని వాసు, సర్పంచ్‌లు మోసిగంటి సత్యవతి, అన్నందేవుల చంటి, ఉప సర్పంచ్‌లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు కృషి చేయాలి



కడియంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామీణ వైద్యులు

కడియం: ప్రతి ఒక్కరూ డెంగీ వ్యాధిపై అవగాహన పెంచుకుని, దాని నివారణకు కృషి చేయాలని కడియం మండల గ్రామీణ వైద్యుల ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రమైన కడియంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్ ప్రారంభించారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలపై గ్రామీణ వైద్యులు అవగాహన కల్పించడాన్ని అభినందించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘ నాయకులు పి.దేవానందం, ఎం.మధుసూదనరెడ్డి, వి.రవి, పి.రాజ్‌కుమార్, కె.శర్మ, కామరాజు, ఎస్‌డీవీ ప్రసాద్, యు.ప్రసాదబాబు, సుంకర శ్రీనివాస్, పి.స్వామిబాబు, బి.గోవిందు, జి.గణేష్, పుత్సల సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

మాది తల్లీకొడుకుల అనుబంధం

డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయశ్రీ ఉద్యోగ విరమణ సభలో డీఈఓ వాసుదేవరావు



డాక్టర్ జయశ్రీని సత్కరిస్తున్న డీఈఓ వాసుదేవరావు, ప్రిన్సిపాల్ బ్రహ్మచారి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ, తాను విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాల్లో కలిసి పని చేశామని, ఆమె సలహాలు తనకు ఎంతగానో ఉపయోగపడ్డాయని, తమది తల్లీకొడుకుల అనుబంధమని డీఈఓ కంది వాసుదేవరావు అన్నారు. గురువారం బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం సీనియర్ లెక్చరర్ ఆర్‌జేడీ రాజు అధ్యక్షతన ఘనంగా జరిగింది. కార్యక్రమానికి డీఈఓ వాసుదేవరావు, ట్రెనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బ్రహ్మచారి, సమగ్ర శిక్షా ఏపీసీ సిరిపురపు సుభాషిణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ట్రెనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మచారి మాట్లాడుతూ, ప్రిన్సిపాల్ జయశ్రీ డైట్ అభివృద్ధికి చేసిన సేవలు అభినందనీయమన్నారు. సమగ్ర శిక్షా ఏపీసీ సుభాషిణి మాట్లాడుతూ, తాను డైట్ పూర్వ విద్యార్థినని, ప్రిన్సిపాల్ జయశ్రీ బయోలాజికల్ సబ్జెక్టు బోధించేవారన్నారు. అప్పట్లో ఆమెను రోల్ మోడల్‌గా, ఐకానిక్‌గా భావించామన్నారు. విశ్రాంత ప్రిన్సిపాళ్లు ఈవీ జ్యోతి, జయప్రకాష్, గంగారావు, ప్రసాద్, సీనియర్ లెక్చరర్లు ఎన్ఆర్ సుబ్రహ్మణ్యం, సుగుణ, ఐటీడీఏ డైట్ ప్రిన్సిపాల్ చినబాబు మాట్లాడుతూ, స్కూల్ అసిస్టెంట్ స్థాయి నుంచి లెక్చరర్‌గా, సీనియర్ లెక్చరర్‌గా, జిల్లా విద్యాశాఖాధికారిగా, డిప్యూటీ డైరెక్టర్‌గా, డైట్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జయశ్రీ ఎనలేని సేవలందించారని కొనియాడారు. అనంతరం డాక్టర్ జయశ్రీని బోధన, బోధనేతర సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు దుశ్శాలువా, జ్ఞాపిక, నూతన వస్త్రాలతో సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జయశ్రీ మాట్లాడుతూ, తన విధి నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీలు వెంకట్‌రాజు, ఛాయాదేవి, ఏఎంవో గౌరీశంకర్, అర్బన్ డీఐ దిలీప్‌కుమార్, విశ్రాంత డీసీవో ఉమామహేశ్వరరావు, ఎంఈవోలు, ప్రైవేటు డిప్లమో ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ విద్యాసంస్థల ప్రతినిధులు, డైట్ పూర్వ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ నేత షబ్బీర్‌కు అభినందన



షబ్బీర్‌ను అభినందిస్తున్న మైనార్టీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ షబ్బీర్‌ను నియమించడం ఆనందదాయకమని పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ హబీబుల్లాఖాన్ అన్నారు. గురువారం స్థానిక లాలాబిన్ లైన్ మసీదులో ఆయనతో పాటు, పలువురు మైనార్టీ నాయకులు కలిసి షబ్బీర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మీర్జా మౌలాలి, సిటీ అధ్యక్షుడు ఎండీ అరిఫుల్లాఖాన్, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఎండీ హమీద్ బాషా, వక్ఫ్ బోర్డ్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎండీ ఆరిఫ్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ నిజాం, పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద రేపు ఉపాధ్యాయుల ధర్నా

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, బోధనను హరించే యాప్‌లను పూర్తిగా రద్దు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ డేనియల్ బాబ్(ఎస్టీయూ), సెక్రటరీ జనరల్ జయకర్ (యూటీఎఫ్) ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర సంఘం పిలుపు మేరకు విద్యా రంగ, ఆర్థిక సమస్యల పరిష్కారానికి శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాను చేపడుతున్నామన్నారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించాలంటూ వివిధ రూపాల్లో ఉద్యమాలు చేసినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

తపస్యధామ్ ఆశ్రమంలో రక్షా బంధన్

అనపర్తి: రక్షా బంధన్ అనేది సోదరుల మధ్య మాత్రమే కాకుండా, ఆధ్యాత్మిక దృక్పథంతో దేవునితో ఉన్న శాశ్వత సంబంధానికి చిహ్నమని బ్రహ్మకుమారీస్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి బీకే రజని అన్నారు. అనపర్తి బ్రహ్మకుమారీస్ తపస్యధామ్ ఆశ్రమంలో గురువారం రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీ మాట్లాడుతూ మానవుల అసలు స్వభావమైన శాంతి, ప్రేమ, స్వచ్ఛత, జ్ఞానం, దయతో ఉండటానికి ప్రతిజ్ఞ చేయాలన్నారు. తద్వారా ప్రతి ఆలోచన, మాట, చర్య ఉన్నతమైనవిగా, దివ్యమైనవిగా ఉంటాయన్నారు. బ్రహ్మ బాబా మురళీ పాఠాలు దైవిక జ్ఞానాన్ని ప్రసాదించి, అపరిమితమైన శాంతిని, ఆనందాన్ని కలుగచేస్తాయన్నారు. రాఖీ కట్టేటప్పుడు వ్యర్థ ఆలోచనలు, మాటలు త్యజించాలన్నారు. బంధాన్ని ఉన్నతమైనదిగా మార్చేలా ఆలోచనలు ఉండాలని సూచించారు. అనంతరం రాఖీ ధారణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కేంద్ర నిర్వాహకురాలు బీకే సుశీల, దేవారెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్ర పరిశ్రమలో రఫీది చెరగని ముద్ర



మహ్మద్ రఫీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిత్‌మోహన్ మిత్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హిందీ నేపథ్య గాయకుడు మహ్మద్ రఫీ తన మధురమైన గానంతో పలు భాషల్లో పాడి భారతీయ చలనచిత్ర పరిశ్రమలో చెరగని ముద్ర వేశారని ఆర్కెస్ట్రా పితామహుడు, నట గాయకుడు జిత్‌మోహన్ మిత్ర కొనియాడారు. జిత్ మోహన్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మధుర గాయకుడు మహ్మద్ రఫీ వర్ధంతి సభ స్థానిక జిత్‌మోహన్ మిత్ర కళా వేదికపై గురువారం సాయంత్రం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిత్‌మోహన్ మిత్ర మాట్లాడుతూ, తన ఆర్కెస్ట్రాలో రఫీ పాటలు పాడి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నానన్నారు. విశాఖపట్నానికి చెందిన ప్రముఖ గాయకుడు గణపతిభొట్ల రామనారాయణకు మహ్మద్ రఫీ పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. ఆర్కెస్ట్రా గాయనీ గాయకులు శ్రీపాద మిత్ర, డా.వంక బాలకృష్ణ, విశ్వనాథ్, డాక్టర్ హరి, సూర్యకుమారి, జి.రామనారాయణ, జి.వెంకటరమణ, డాక్టర్ నళినీరమేష్, ఆదిత్యప్రసాద్, పోస్టల్ ప్రసాద్, డాక్టర్ కృష్ణ, జీవీఎస్ లక్ష్మీ తులసి, బి.రామకృష్ణ, డాక్టర్ సోమరాజునాయుడు తదితరులు మహ్మద్ రఫీ పాటలు పాడి స్వర నివాళులర్పించారు.